ఏళ్లు గడుస్తున్నా కానరాని పురోగతి

నత్తనడకన హరిత హోటల్ నిర్మాణం

- రెండు దఫాల్లో రూ.9.50కోట్ల నిధుల కేటాయింపు
- అయినా కొలిక్కిరాని నిర్మాణం
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల పట్టింపులేని తనం
- వృథాగా మారిన రూ.లక్షలాది విలువైన సామగ్రి



హరిత ఫంక్షన్ హాల్..


మధ్యలో నిలిచిపోయిన హరిత హోటల్ భవన నిర్మాణం

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం జిల్లా కేంద్రంలో టూరిజం హోటల్ నిర్మాణ పనులు ఆరంభమైన ఎనిమిదేళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. నిధుల లేమి, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ లోపంతో ఈ పరిస్థితి నెలకొన్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర టూరిజం డెవలమెంట్ కార్పొరేషన్ 2014లో కొత్తగూడెంలో హరిత హోటల్, కిన్నెరసానిలో అద్దాల మేడ, తొమ్మిది కాటేజీలు, ఫుడ్ కోర్టు నిర్మాణానికి రూ.10.77 కోట్ల నిధులు కేటాయించింది. ఇందులో లక్ష్మీదేవిపల్లి మండలం ఇల్లెందు క్రాస్ వద్ద హరిత హోటల్ నిర్మాణానికి రూ.6.50 కోట్లు కేటాయించగా... 2016లో హోటల్ నిర్మాణం పనులు ప్రారంభించారు. మొదట పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ జాప్యం చేయటంతో.. పంచాయితీ రాజ్ శాఖకు బాధ్యతలు అప్పగించారు. దీంతో కొన్ని రోజులు సజావుగా సాగిన పనులు మళ్లీ నిలిచిపోయాయి. మరో కాంట్రాక్టర్‌కు 2020లో పనులు కట్టబెట్టారు. అయినా పనులు నత్తనడకగానే కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు హోటల్ భవనం, ఫంక్షన్ హాల్ భవన నిర్మాణాలు మాత్రం పూర్తయ్యాయి. అయితే, 44 గదుల్లో సీలింగ్, టైల్స్ పనులు నిలిచిపోగా.. అందుకోసం తీసుకొచ్చి సామగ్రి పనికి రాకుండా పోయే స్థితికి చేరింది. ఇక ఇంతవరకు జరిగిన నిర్మాణ పనులు సైతం అస్తవ్యస్తంగా జరగడంతో కొన్ని నిర్మాణాలు కూల్చివేసి తిరిగి నిర్మించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలన

హరిత హోటల్ నిర్మాణ పనులను ఇటీవల కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. ఇకనైనా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సైతం హరిత హోటల్ పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

మళ్లీ అగ్రిమెంట్..

లక్ష్మీదేవిపల్లి మండలం ఇల్లెందు క్రాస్ వద్ద హరిత హోటల్ నిర్మాణ పనులు ఏళ్ల తరబడి అగిపోవటంతో అధికారులు కొత్తగా రూ.3.50 కోట్లకు టెండర్ పిలిచారు. ఈ పనులకు గతంలో హరిత హోటల్ నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టరే దక్కించుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో టెండర్ ప్రక్రియ పూర్తికాగా.. మూడు నెలల్లో నిర్మాణం పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఏఈ శివప్రసాద్ తెలిపారు. కానీ ఏప్రిల్ వచ్చినా పనులు మొదలే కాలేదు. జిల్లా అధికారులు నిత్యం తిరిగే ప్రాంతంలోనే హరిత హోటల్ నిర్మాణం మధ్యలో నిలిచిపోయి.. పిచ్చిమొక్కలతో చిన్న పాటి అడవిని తలపిస్తోంది. ఇకనైనా అధికారులు స్పందించి హోటల్ నిర్మాణం పూర్తి చేయించాలని తద్వారా జిల్లావాసులకే కాక పర్యాటకులకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

రూ.లక్షల్లో నిధులు వృథా..

హరిత హోటల్ గదుల్లో నాసిరక నిర్మాణం చేయటంతో రూ.లక్షలాది నిధులు వృథా అయ్యాయి. గదులో సీలింగ్, మెటీరియల్ పనికి రాకుండా పోయింది. అంతేకాకుండా టైల్స్, బండలు పగిలిపోయాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టర్లు వరంగా మారడంతో ఈ పరిస్థితి నెలకొన్నట్లు చెబుతున్నారు. కారణాలు ఏమైనా ప్రభుత్వంపై మాత్రం అదనపు భారం పడుతోంది.


హోటల్ గదుల్లో అస్తవ్యస్తంగా పడేసిన సామగ్రి

గంగాదేవిపల్లిలో పర్యటించిన అదనపు కలెక్టర్


పనిచేయని సోలార్ పంపును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచరూరల్: మండలంలోని ఉల్వనూరు గ్రామపంచాయతీ పరిధి గంగాదేవిపల్లిలో రెండు నెలలుగా సోలార్ పంపు సెట్ పనిచేయకపోగా, మిషన్ భగీరథ ద్వారా రెండు, మూడురోజులకో సారి తాగు నీరు సరఫరా చేస్తుండడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'పనిచేయని సోలార్ పంపు' శీర్షికన 'సాక్షి'లో సోమవారం కథనం ప్రచురితమైంది. దీంతో అదనపు కలెక్టర్ విద్యాచందన గ్రామాన్ని సందర్శించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి సమస్య లేకుండా చూడాలని సూచిస్తున్నా రెండు నెలలు నుంచి సోలార్ పంప్ పనిచేయని విషయాన్ని చెప్పకపోవడంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నీలావతి, కార్యదర్శి నరేష్‌ను మందలించారు. ఈ విషయమై సాయంత్రానికి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అలాగే, సోలార్ పంపు మరమ్మతులపై ప్రతిపాదనలు సమర్పించాలని, గ్రామంలో తాగు నీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అతర్వాత ఆమె ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి, ఎంపీఓ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు


ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల శ్రీ రుక్మిణీ సహిత శ్రీసంతాన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ఈ నెల 5 వరకు జరగనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ అల్లాడి నరసింహారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఆలయ పునర్నిర్మాణం జరిగిన తరువాత స్వామి వారి ప్రథమ బ్రహ్మోత్సవ కార్యక్రమాలు శ్రీ కృష్ణ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు 4వ తేదీ ఉదయం 9 గంటలకు స్వామి వారి కల్యాణం, మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన

జూలూరుపాడు: మండలంలోని అన్నారుపాడు, గంగారంతండా, పుల్లుడుతండా, తదితర గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతారం శ్రీ అభయహస్త వీరాంజనేయస్వామి ఆలయం కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, మండలాధ్యక్షుడు మాళోత్ మంగీలాల్ నాయక్, ఎంపీటీసీ మధుసూదనరావు, రోకటి సురేష్, ధరావత్ రాంబాబు, లకావత్ లచ్చు నాయక్, వేల్పుల నరసింహారావు, పోతురాజు నాగరాజు, బానోత్ నవీన్, అరిగెల నరసింహారావు, బానోత్ బాబు, బానోత్ జగన్, ధర్మరాజుల వెంకటనారాయణ, భూక్యా అమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న పీఏసీఎస్ కార్యదర్శి హరిప్రసాద్

ఇల్లెందురూరల్: మండలంలోని చల్లసముద్రం పంచాయతీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ కార్యదర్శి రాజేంద్రుల హరిప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కోసం మండల వ్యాప్తంగా చల్లసముద్రం, కొమరారం కేంద్రంగా కొనుగోలు కేంద్రాలు మంజూరయ్యాయన్నారు. కొమరారంలో రెండు రోజుల్లో కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. 17 శాతం తేమ ఉన్న ధాన్యం ఏ గ్రేడు రకంకు రూ.2,203, సాధారణ రకం రూ.2,183 చొప్పున చెల్లిస్తామని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి రమేష్, రైతులు ధనియాకుల బాబు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

ఇల్లెందు: సింగరేణి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధికి కల్పించిన ఉచిత శిక్షణకు దరఖాస్తుల గడువును పొడిగించినట్టు సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌ఆనంద్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ... 38 కోర్సులలో ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాల్సిన వారు ఈనెల 15 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాస్మోటాలజీ, డ్రోన్, సోలార్, సెల్ టెక్నీషియన్, టూవీలర్ మెకానిక్, ఆర్క్ అండ్ గ్యాస్ వెల్డింగ్, కంప్యూటర్ డీటీపీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ తదితర కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

గ్లోబల్ టెండర్‌ను రద్దు చేయాలి

టేకులపల్లి: కోయగూడెం నుంచి ఇల్లెందు సీఎస్పీ వరకు బొగ్గు రవాణా చేస్తున్న టిప్పర్ టెండర్లను సాధారణ టెండర్లుగా నిర్వహించాలని ఇఫ్టూ రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే గ్లోబల్ టెండర్లు దక్కించుకున్న శ్రీదేవి ట్రాన్స్‌పోర్టు టెండర్లను రద్దు చేయాలన్నారు. ఓసీని నమ్ముకొని టిప్పర్లు కొనుగోలు చేసిన యజమానులు, డ్రైవర్ల జీవనోపాధిని గ్లోబల్ టెండర్లు దెబ్బతీస్తాయన్నారు. సింగరేణి యాజమాన్యం పునరాలోచించి సాధారణ టెండర్లుగా నిర్వహించాలని కోరారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనపై హర్షం


కొత్తగూడెం జీఎంను అభినందిస్తున్న నాయకులు


ఇల్లెందు జీఎంను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

సింగరేణి(కొత్తగూడెం)/ఇల్లెందు: సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం(2023–24)లో నిర్దేశించుకున్న 70 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని పూర్తిచేసిన నేపథ్యాన హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో సీఎండీ ఎన్.బలరామ్‌ను సింగరేణి అధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతి గౌడ్ ఆధ్వర్యాన సోమవారం సన్మానించారు. అలాగే, కొత్తగూడెం ఏరియాలో 106 శాతం ఉత్పత్తి సాధించడంపై జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజును ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు సన్మానించారు. ఇక కొత్తగూడెం ఏరియాలో 109 శాతం ఉత్పత్తి సాధించిన సందర్భంగా ఏరియా జీఎం జాన్ ఆనంద్‌ను ఎమ్మెల్యే కోరం కనకయ్య సత్కరించారు. నాయకులు మడుగు సాంబమూర్తి, గోచికొండ సత్యనారాయణ, భూక్యా నాగేశ్వరరావు, పడిదల నవీన్, బొల్లి రాజు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లలో ఇల్లెందు ముందంజ..

- రాష్ట్రంలోనే రెండో స్థానం
- మొదటి స్థానంలో నిలిచిన సిరిసిల్ల
- ఉద్యోగులను అభినందించిన చైర్మన్, కమిషనర్లు


ఇల్లెందు మున్సిపాలిటీ కార్యాలయం

ఇల్లెందు: మున్సిపాలిటీలో ఏ పనికైనా నిధులు సమృద్ధిగా ఉండాలి. పట్టణ ప్రజల సహకారం లేకుండా పన్నులు వసూలు కావడం కష్టమే. ఈ తరుణంలో గత రెండు నెలలుగా మున్సిపాల్టీలో పన్నుల వసూలు సాగుతోంది. ఎట్టకేలకు పన్నుల వసూళ్లల్లో ఇల్లెందు మున్సిపాలిటీ రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా పన్నులు వసూలులో సిరిసిల్ల మొదటి స్థానంలో ఉండగా ఇల్లెందు రెండో స్థానంలో నిలిచింది. మొదటి స్థానంలో నిలిచిన సిరిసిల్లలో రూ.5.56 కోట్లకు గాను రూ.5.49 కోట్లు, ఇల్లెందులో రూ.1.90 కోట్ల డిమాండ్‌కు రూ.1.80 కోట్లు వసూలయ్యాయి. తద్వారా 94.82 శాతం పన్నులు వసూలుచేసినట్లయింది. కమిషనర్ యాదగిరి, మేనేజర్లు నిరంతరం పర్యవేక్షణ వల్ల పన్నుల వసూలు శరవేగంగా సాగటం వల్లే రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా బిల్ కలెక్టర్లను చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ యాదగిరి, మేనేజర్ అంకుషావలీ అభినందించారు.

ఉద్యోగుల కృషి అభినందనీయం



ఆస్తి పన్నుల వసూళ్లల్లో ఇల్లెందు మున్సిపాలిటీ రెండో స్థానంలో నిలువటం అభినందనీయం, బిల్ కలెక్టర్లు నిరంతరం కృషి చేయటం వల్ల సుసాధ్యమైంది. నూటికి నూరు శాతం పన్నుల వసూలు చేయటం వల్ల రాష్ట్రంలో ఇల్లెందు మున్సిపాల్టీ తలెత్తుకుని నిలబడుతుంది. పట్టణవాసులు సహకరించాలి.

– దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్

నిరంతర పర్యవేక్షణతోనే..



మున్సిపాల్టీలో పన్నుల వసూలులో రెండో స్థానంలో నిలువటం గర్వంగా ఉంది. మరో పది శాతం వసూలైతే మరింత బాగుండేది. పట్టణ ప్రజలు పన్నుల వసూలకు సహకరించాలి. బిల్ కలెక్టర్‌లు నూటికి నూరుశాతం వసూలయ్యేలా కృషి చేయాలి.

– యాదగిరి, కమిషనర్, ఇల్లెందు

ప్రజలే గుణపాఠం చెబుతారు..


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

జూలూరుపాడు: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతారని మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ అన్నారు. సోమవారం జూలూరుపాడు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యల్లంకి సత్యనారాయణ, పీజీ క్రిష్ణమూర్తి, చావా వెంకటరామారావు, దుద్దుకూరి నాగేశ్వరరావు, నిమ్మటూరి కనకయ్య, బానోత్ చందర్, మాళోత్ నరసింహారావు, బానోత్ హరిలాల్, శీరంశెట్టి అన్వేష్, తాళ్లూరి పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వీరభద్రం

పాల్వంచ: ప్రతీ వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడమే తమ లక్ష్యంగా కృషి చేస్తున్నామని శ్రీ సద్గురు ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రభోదానంద డాక్టర్ జి.వీరభద్రం అన్నారు. సద్గురు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్, గొల్లగూడెం నందు ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సోమవారం వీరభద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 15 చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి సత్సంగం సెంట్రల్ కమిటీ సభ్యులు రామ్మూర్తి, నిర్వాహకులు ఈరబోయిన వెంకటేశ్వరరావు, వంకా రాంబాయి, రాణి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ కార్మికులకు ఈఎస్ఐ కార్డులు అందజేయాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఈఎస్ఐ కార్డులు అందజేయాలని కోరుతూ సోమవారం సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి మధు జీఎం బి.హనుమంత రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ... ఈ విషయమై ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్ టి.రేణుకా ప్రసాద్‌కూ వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఈఎస్ఐ సేవలు కల్పించేందుకు యాజమాన్యం 2022లోనే అంగీకరించిందని, ఈ విషయం సెంట్రల్ లేబర్ అధికారుల వద్ద ఒప్పందం కుదిరిందన్నారు. కానీ నేటికి అమలుకు నోచులేదన్నారు. దీనికి స్పందించిన జీఎం ఉన్నతాధికారులతో చర్చించి వీలైనంత త్వరలో పరిష్కార మార్గం చూస్తామని హామీ ఇచ్చారు


జీఎం పర్సనల్ హనుమంతరావుకు వినతిపత్రం అందజేస్తున్న మధు

ఆదివాసీలపై కేసులు ఎత్తివేయాలి


మాట్లాడుతున్న మధు

ఇల్లెందు: సత్తుపల్లి ఏరియా బుగ్గపాడు ఆదివాసీలపై దాడులు నిలిపి వేయాలని, ఆదివాసీలపై అక్రమంగా మోపిన కేసులు ఎత్తివేయాలని సీపీఐ(ఎంఎల్) ఎన్డీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు డిమాండ్ చేశారు. సోమవారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుగ్గపాడు– చంద్రాయపాలెంలో జరిగిన ఘర్షణలకు అటవీశాఖ అవలంభించిన వైఖరే కారణమన్నారు. తక్షణం వారిపై మోపిన కేసులు ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్డీ నాయకులు టి.నాగేశ్వరరావు, వై. ప్రకాష్, జానకీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కూనంనేని పర్యటన

పాల్వంచరూరల్: ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం మండల పరిధిలో పర్యటించనున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి వినంశెట్టి పూర్ణచందర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పలుగ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, కాంగ్రెస్ మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

జూలూరుపాడు: నవోదయ పాఠశాలకు ఎంపికైన సాయి ఎక్స్‌లెంట్ విద్యార్థులను సోమవారం తహసీల్దార్ కె.స్వాతిబిందు అభినందనలు తెలిపారు. కరస్పాండెంట్ కృష్ణ ప్రసాద్, డైరెక్టర్లు ఆరెబోయిన హుస్సేన్, సీహెచ్ పుల్లారావు, ఉపాధ్యాయులు కృష్ణయ్య, మోహన్, మణిదీప్, పేరెంట్స్ హళావత్ నరసింహారావు, చలపతి, కొలిపాక సురేష్, రెవెన్యూ సిబ్బంది రామారావు, బహర్‌అలీ, సిద్దా, పాల్గొన్నారు.

టేకులపల్లి: మండలంలోని గ్రావిటీ ప్రీమియర్ పాఠశాల విద్యార్థి రిషి నవోదయ ప్రవేశ పరీక్షలో సీటు సాధించగా ఉపాధ్యాయులు, విద్యార్థులు రిషికి అభినందనలు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

జూలూరుపాడు: వెంగన్నపాలెం–జూలూరుపాడు పొలిమేర ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించాలని బీఎస్పీ మండలాధ్యక్షుడు తంబర్ల నరసింహారావు అన్నారు. సోమవారం ఆయన వెంగన్నపాలెం–జూలూరుపాడు గ్రామాల మధ్యగల పొలిమేర ప్రాంతంలోని నివాస గృహాలను సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొలమేరలో నివాసం ఉంటున్న ప్రజలకు తాగునీటి సరఫరా జరగక ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. భోగ లలిత, లక్ష్మీ, రజనీ, అనిత, జ్యోతి, లక్ష్మీకాంతం, ప్రశాంతి పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తాచాటాలి


మాట్లాడుతున్న సాబీర్‌పాషా

పాల్వంచరూరల్: పదేళ్ల బీజేపీ పాలనలో ప్రభుత్వ రంగసంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించిన మోదీని గద్దె దింపే లక్ష్యంతో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త పనిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా కోరారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని సాయిసాదన్‌హాల్లో సోమవారం జరిగిన సమావేశంలో లక్ష్మీదేవిపల్లి మాజీ సర్పంచ్ భూక్యావిజయ్, ఉపసర్పంచ్ వేములపల్లి రాజశేఖర్ ఆధ్వర్యంలో వంద కుటుంబాలు పార్టీలో చేరినట్లు పాషా తెలిపారు. ఎమ్మెల్యే కూనంనేని సహకారంతో సమిష్టిగా నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వినంశెట్టి పూర్ణచందర్‌రావు, పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, బండి నాగేశ్వరరావు, సుధాకర్, శ్రీనివాసరావు, గిరి, జకరయ్య, పాషా, సురేష్, సత్యనారాయణ, శోభారాణి, పవిత్ర, సోమయ్య, రాము, అశోక్, సత్యం, బాబురావు పాల్గొన్నారు.

కిరణ్ ఆశయ సాధనకు కృషి


నివాళులర్పిస్తున్న నాయకులు

ఇల్లెందు: తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్(ఇఫ్టూ) నాయకుడు హైదరాబాద్‌కు చెందిన వడ్లకొండ కిరణ్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఇఫ్టూ నాయకుడు పాయం వెంకన్న కోరారు. సోమవారం ఇల్లెందులోని కరెంటాఫీస్ వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడ్చెల్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా యూనియన్ బలోపేతం కోసం కృషి చేశాడన్నారు. ఈ సమావేశంలో నాయకులు నరేష్, మదార్, అశోక్, కమలాకర్, రవి, రాజేష్, పవన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం విధానాలపై నిరసన



నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు

చుంచుపల్లి: కాంగ్రెస్ చుంచుపల్లి మండలాధ్యక్షుడు అంతోటి పాల్ ఆధ్వర్యంలో సోమవారం కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కొత్తగూడెంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ఆర్థిక శాఖ ద్వారా అఖిలభారత కాంగ్రెస్ కమిటీ బ్యాంక్ ఖాతాలను నిలిపివేసిన తీరును ఖండించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బద్దే కిషోర్, జలీల్ రామ్మూర్తి, కుమార్, అక్బర్, ఫైజుద్దీన్, ఖాదర్, అరుణ్ నాయక్, అంతోటి రాజు, అంతోటి కనీష్, గడ్డం నితిన్, సందీప్, దిలీప్, సిరి, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.